క్లుప్తంగా

విప్లవ యోధుడు గద్దర్

చీరాల: ప్రజా కవి, ప్రజా కళాకారుడు గద్దర్ సంస్మరణ సభను చీరాలలో నిర్వహించుకోవడం అందరి బాధ్యతని ప్రజా సంఘాల నాయకులు జూలియన్ అన్నారు. బుధవారం స్థానిక ముక్కోణం పార్కు సెంటర్‌లో ప్రజా కవి, ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. పలువురు మాట్లాడుతూ కారంచేడు, చుండూరు మారణ హోమంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి న్యాయం కోసం పోరాటం చేసిన విప్లవ యోధుడన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేసి విప్లవ బాట పట్టారన్నారు. ఆయన రచించి ఆలపించిన గేయాలు బహుళ ప్రాచుర్యం పొందాయన్నారు. పోలీస్ శాఖపై వారి జీవితాల్లో ఉన్న బాధలపై అనేక పాటలు రాసి పాడిన మహోన్నతమైన వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. బహుజన సమాజ్ పార్టీ నాయకులు డి.భాస్కరరావు, దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌కుమార్ ధర్మా, దళిత కులాల ఐక్యవేదిక నాయకులు చప్పిడి వెంగళరావు, మాల మహాసభ నాయకులు ప్రకాష్, మహిళా నాయకురాలు తెలగతోటి ప్రేమకుమారి పాల్గొన్నారు.

నాగండ్లలో నేత్రదానం



దాత నూతలపాటి చిన్నబ్బాయి

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని నాగండ్ల గ్రామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 517వ నేత్రదానం బుధవారం పూర్తి చేశారు. నాగండ్ల గ్రామానికి చెందిన నూతలపాటి చిన్నబ్బాయి (67) బుధవారం చనిపోవడంతో అతని నేత్రాలను కుటుంబ సభ్యులు ధనలక్ష్మి, మార్తమ్మ, ద్రాక్షయణమ్మ, మార్తయ్యలు దాత కార్నియాలను దానం చేసేందుకు ముందుకు వచ్చి రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దాత కార్నియాలను గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు సేకరించారు. దాత కుటుంబ సభ్యులను అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, కమలేశ్వరరావు, చుండి సాంబశివరావు, కుటుంబ సభ్యులను అభినందించారు.

ఘనంగా ఆడపడుచుల సారె



అమ్మవార్ల సన్నిధిలో నైవేద్యాలతో వస్తున్న మహిళలు



కారంచేడు గ్రామప్రధాన వీధుల్లో పొంగళ్ళు తీసుకొస్తున్న ఆడపడుచులు

కారంచేడు: గ్రామ దేవతులుగా వీరాజిల్లుతున్న గంగమ్మ తల్లి, పోలేరమ్మ తల్లికి గ్రామ ఆడపడుచులు బుధవారం సారె సమర్పించారు. మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన అమ్మవార్లకు గ్రామంలోని అన్ని ప్రాంతాలకు చెందిన మహిళలు తమ ఇళ్ల నుంచి ప్రత్యేకంగా తయారు చేసుకున్న పొంగళ్ళను ఊరేగింపుగా అమ్మవార్ల సన్నిధికి తీసుకొచ్చారు. మేళ తాళాలు, భాజా భజంత్రీలతో, యువతీ, యువకుల నృత్యాలు, వీరతాళ్ళతో అమ్మవార్ల వద్దకు ఈ నైవేద్యాలను తీసుకొచ్చి సమర్పించారు. గ్రామ ఆడపడుచులు ఎక్కడెక్కడ నివాసముంటున్న అధిక శ్రావణమాసం పురస్కరించుకొని ఈ సారె సమర్పించడం ఆనవాయితీ. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయసాయిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కరణం



విజయసాయిరెడ్డితో ఎమ్మెల్యే కరణం, నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ కోస్తా జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, పార్టీ అన్ని అనుబంధ విభాగాల అధ్యక్షుడు, ఎంపీ విజయసాయిరెడ్డిని బుధవారం చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. బాపట్ల జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా బాపట్లలోని కోన భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

విజయసాయిరెడ్డిని కలిసిన ఆమంచి



విజయసాయిరెడ్డిని కలిసిన ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): రాజ్యసభ సభ్యుడు, జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ వి. విజయసాయిరెడ్డిని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

బాపట్ల కోన భవన్‌లో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ సమీక్ష సమావేశంలో భాగంగా ఆయన విజయసాయిరెడ్డిని కలిసి పూల బోకే అందజేశారు.

అంకితభావంతో విధులు నిర్వహించండి

చీరాల టౌన్: పరిపాలనలో పారదర్శకత, అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీఓ నేతాజీ సూచించారు. బుధవారం గాంధీనగర్, కొత్తపాలెం, చీరాల నగర్ సచివాలయాలను ఎంపీడీవో పరిశీలించారు. సచివాలయాల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీల రికార్డులను, సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల రిజిస్టర్లను ఎంపీడీవో పరిశీలించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అర్జీదారులకు జవాబుదారీతనంగా ఉద్యోగులు పనిచేయాలని కోరారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన వారి సేవలను ప్రశంశిస్తారన్నారు. సెక్రటరీలు, సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ఇన్‌చార్జ్ ఆమంచి



పావులూరులో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమంచి

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పావులూరులో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ప్రచారం నిర్వహించారు. పావులూరు గ్రామం నందు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పాఠశాలకు సిమెంట్ బల్లలు అందజేత

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాలుగు సిమెంట్ బల్లలు, రెండు ఐరన్ ర్యాక్స్ అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య సేవలు పొందాలి

చీరాల టౌన్: గర్భిణులు విధిగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఈపురుపాలెం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదేవి సూచించారు. బుధవారం 25 మందికి పరీక్షలు చేశారు. 20 రోజులకు ఒకసారి విధిగా వైద్యుల వద్ద సేవలు పొందాలన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు పాలు, గుడ్లు, ఆకుకూరలు, బెల్లం విధిగా రోజువారీ ఆహారంలో ఉండాలన్నారు. రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

అంజన్నకు ఘన పూజలు



అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి ఆమావాస్య సందర్భంగా ఆదివారం దశ సహస్ర కదళీ ఫలార్చన (పదివేల అరటిపండ్ల)తో అర్చన చేశారు. దీనిలో భాగంగా ఉదయం గోపూజ, బందె తీర్థం, స్వామివారికి అభిషేకం, అలంకరణ, వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలు వేదస్వస్తి, మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ, గణపతి, సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజ, రుత్విగ్వరణ, 11 వరుసలుగా దేవస్థానం వేదపండితులచే అరటిపండ్లతో అర్చన చేశారు. అనంతరం మహానివేదన, పంచహారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదాతలుగా పానకాల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. పూజ అనంతరం అర్చకులు, ఉభయదాతలను భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి సుభద్ర పర్యవేక్షించారు.



కోలలపూడిలో గుండె వైద్య శిబిరం

మార్టూరు: మండలంలోని కోలలపూడిలో బుధవారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ హెల్ప్ ఆసుపత్రి వైద్యబృందం వారిచే నిర్వహించిన వైద్యశిబిరంలో 102 మంది రోగులకు ఈసీజీ, ఎకో తదితర పరీక్షలను నిర్వహించి 10 మందిని యాంజియో గ్రామ్ పరీక్షలకు ఎంపిక చేశారు. అనంతరం అవసరమైన రోగులకు శస్త్రచికిత్సలు, స్టంట్‌లు ఉచితంగా వేసి.. సంవత్సర కాలంపాటు రోగులకు ఉచిత వైద్య సహాయం అందించనున్నట్లు గుండె వైద్య నిపుణుడు సాయిరెడ్డి తెలిపారు. సిబ్బంది శివప్రసాద్, సాయి కిరణ్ స్థానికులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

అద్దంకి: ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం కమిటీ సభ్యులు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవలకు అవార్డు పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేశ్ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి కొత్రపాటి వెంకట కృష్ణ, ఏఎస్‌ఐ అమర్‌నాథ్, ఆర్ఐ శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఇలాంటి పేరు రావడం సంతోషకరమన్నారు. తెలగతోటి రాధాకృష్ణమూర్తి, మదర్సా ప్రిన్సిపాల్, జ్యోతి డేవిడ్, కొమ్మాలపాటి బుజ్జి, చెన్నుపల్లి నాగేశ్వరరావు, మంచు హనుమంతరావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మునిసిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం నిజ శ్రావణ మాసం ఆశ్లేష నక్షత్రం పాడ్యమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసి వేస్తారు.

పంట నమోదుపై ప్రత్యేక డ్రైవ్



ఇసుక దరిశిలో పంటల నమోదు పరిశీలిస్తున్న అధికారులు

మార్టూరు: మండలంలోని రైతుల పంటల నమోదుకు సంబంధించి బుధవారం అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, ఏఓ కిరణ్‌కుమార్, ఉద్యాన వన శాఖాధికారి బి. హనుమంత నాయక్ రాజుపాలెం, ఇసుక దరిశి, నాగరాజుపల్లి గ్రామాల్లో పర్యటించి పంటల నమోదు తీరు పర్యవేక్షించారు. ఏడీఏ కేవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంటన నమోదు వలన ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత పంటల బీమా, పంట నష్టం, పావలా వడ్డీ, పంటల కొనుగోలు, పథకాల లబ్ధి తదితర ప్రయోజనాలు పొందగలుగుతారని స్థానిక ఆర్బీకే సెంటర్‌లో ఇ- క్రాప్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు.



పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు



మాట్లాడుతున్న పర్చూరు డివిజన్ డీవైఈఓ శ్రీనివాసరావు

చీరాల అర్బన్: జిల్లాలో వినియోగదారుల ఉద్యమాన్ని మరింత చైతన్యవంతం చేయడంలో భాగంగా ప్రతి పాఠశాలలో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పర్చూరు డివిజన్ డిప్యూటీ ఈఓ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పర్చూరు డివిజన్ స్థాయి వినియోగదారుల క్లబ్ నిర్వాహకుల అవగాహన సదస్సు స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన శిక్షణ కరదీపికను ఆవిష్కరించారు. డివిజన్‌లోని 110 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం, మార్చి 15న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాల సందర్భంగా 8,9 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించాలన్నారు. బిల్ లేకుండా ఏ వస్తువును కొన వద్దని సూచించారు. వ్యాపార ప్రకటనల్లో మోసాలు గుర్తించాలన్నారు. మేలుకొలుపు సంఘం అధ్యక్షులు దాసరి ఇమ్మానియేలు, జిల్లా సైన్స్ అధికారి సాదిక్ మహమ్మద్, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



పంగులూరులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సిబ్బంది

జె.పంగులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చిరు ఉద్యోగులకు ఎంతో అండగా ఉంటున్నారన్నారని బాపట్ల జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు సాల్మన్ అన్నారు. స్త్రీ శక్తి భవనంలో బుధవారం వెలుగు సిబ్బంది ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఏపీఎం ప్రసాద్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజల ఆదాయం, అభివృద్ధి వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు డీఆర్‌డీఏ వైఎస్సార్ కేపీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 23 శాతం జీతం పెంచినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సీసీలు కామేశ్వరావు, దాసు, వీఓఏలు సభాషిణి, నాగరాజ, మీరాబి పాల్గొన్నారు.

సామాన్యుడికి సత్కారం



గోవింద స్వామిని సన్మానిస్తున్న పెద్దలు

చినగంజాం: తమిళనాడులో జన్మించి ఆంధ్ర రాష్ట్రంలో ఒక యాచకునిగా ప్రవేశించిన భారత్ నిర్మాణ్ వలంటీర్‌గా గుర్తింపు పొందిన ఏళుమలై గోవిందస్వామిని పలువురు పెద్దలు బుధవారం స్థానిక వాల్మీకి వృద్ధాశ్రమంలో సన్మానించారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థల అభినందనలను పొందిన వ్యక్తి కావడంతో ఘనంగా సన్మానించారు. తమిళనాడు బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ జనరల్ మేనేజర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ జేడీ ఆంజనేయులు, షేక్ జిలాని, కె. వెంకటేశ్వర్లు, ఎం. అంజిరెడ్డి, సైమన్, ఏ. లక్ష్మి పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తృతం

చీరాల రూరల్: ప్రైవేటు సెల్యూలర్‌లకు దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే బీఎస్ఎన్ఎల్ విస్తృత సేవలు అందిస్తోందని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం బీఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీ ఆధ్వర్యంలో ఉచిత సిమ్‌కార్డు మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 250 విలువ కలిగిన సిమ్ కార్డును రూ. 50 కస్టమర్లకు అందజేశారు. అలానే 45 రోజులు పాటు వాలిడిటీ కలిగిన ఈ కార్డు ద్వారా అన్ లిమిటెడ్ ఫోన్ కాల్స్, ప్రతిరోజూ 2 జీబీ డేటా ఉచితంగా అందించనున్నట్లు నిర్వాహకులు హరికృష్ణ తెలిపారు. ప్రస్తుతం ప్రైవేటు సెల్యూలర్‌లు కస్టమర్ల వద్ద అధిక ధరలు వసూలు చేస్తున్నారని, అదే బీఎస్ఎన్ఎల్ ద్వారా అందించే టారిఫ్‌లు తక్కువ ధరకు అందిస్తున్నట్లు చెప్పారు. బీఎస్ఎన్ఎల్ అందించే నాణ్యమైన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఫిజియోథెరపీతో స్వస్థత

బల్లికురవ: వైకల్యం కలిగిన 14 సంవత్సరాల్లోపు చిన్నారులతో నిత్య వ్యాయామం, ఫిజియోథెరపీ పరీక్షలతో స్వస్థత పొందవచ్చని ఫిజియో థెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం వైదనలోని భవిత కేంద్రంలో 12 మంది చిన్నారులకు ఆమె పరీక్షలు చేశారు. ప్రతి బుధవారం జరిగే క్యాంపుకు చిన్నారులను తీసుకురావాలని కోరారు. పౌష్టికాహారం తోపాటు సాధారణ పిల్లతో సమానంగా పెంచాలన్నారు. ఐఈఆర్పీ నాగబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర్‌కు అభినందనలు

చీరాల టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో చీరాల మండలాన్ని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపి, ఉత్తమ తహసీల్దార్‌గా రెండోసారి అవార్డులు సాధించిన జీవిగుంట ప్రభాకరరావు సేవలకు మార్గదర్శమని డీటీ సురేష్‌కుమార్ అన్నారు. 77వ స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ రంజిత్ బాషా, ఆర్డీవో సరోజిని సమక్షంలో ఉత్తమ తసీల్దార్‌గా అవార్డు తీసుకోవడంతో కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది తహసీల్దార్‌తో పాటు డీటీ సురేష్‌కుమార్, ఉత్తమ సేవా అవార్డు పొందిన ఆర్ఐ శేఖర్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. జగనన్న సురక్షలో సర్వీసులు అందించడం గర్వకారణమన్నారు. చీరాల మండలానికి ప్రత్యేక ఖ్యాతిని వచ్చేలా కృషి చేసిన తహసీల్దార్ ప్రభాకరరావు, డీటీ సురేష్, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఆర్ఐ శేఖర్ సేవలను ప్రశంసించి రెవెన్యూ ఉద్యోగులు సత్కరించారు. సర్వేయర్ చార్లెస్, వీఆర్వోలు జ్యోతి, శంకర్, రాబాబు, అశోక్, సిబ్బంది మస్తాన్, లక్ష్మయ్య, నాగేశ్వరరావున్నారు.



తహసీల్దార్ ప్రభాకరరావు సత్కరిస్తున్న ఉద్యోగులు